

ప్రజ్ఞా శిఖరం 'మోక్షగుండం'

నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి


మోక్షగుండం విశ్వేశ్వరయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆధునిక కాలంలో ఇంజినీరింగ్ వ్యవస్థకు ఎంత గొప్ప ప్రాధాన్యత ఉందో అందరికీ తెలిసిందే. మానవుడికి కనీస అవసరాలైన కూడు, గూడు, వస్త్రాలలో ఒకటైన గూడు (ఇల్లు) నిర్మాణంలో ఇంజినీర్లది ముఖ్యమైన పాత్ర. నివాస గృహాలైనా, కార్యాలయాలు, కర్మాగారాలైనా, చర్చిలు, మసీదులు, ఆలయాలు, చెక్‌డ్యాంలు, భారీ ప్రాజెక్టులు ఇంజినీర్ల ప్రతిభకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. మన దేశానికి చెందిన గొప్ప ఇంజినీరు, సాంకేతిక ప్రజ్ఞా శిఖరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన పుట్టిన రోజు సెప్టెంబరు 15న ఇంజనీర్ల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాము. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇంజినీర్లకు 'సాక్షి' ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

'మోక్షగుండం' జీవిత విశేషాలు

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞామూర్తిగా పేరు గడించారు. సివిల్ నిర్మాణాలు, నీటిపారుదల, వరదల నివారణ కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇలా ఎన్నో విశిష్టమైన కట్టడాల నిర్మాణంతో ఆయన ఇతర దేశాల సాంకేతిక నిపుణుల ప్రశంసలు పొందారు. 1816లో కర్ణాటక కోలార్ జిల్లాలో జన్మించిన మోక్షగుండం పూర్వీకులు ప్రకాశం జిల్లాకు చెందిన వారే. బెంగళూరు, పూణెలలో విద్యాభ్యాసం చేసి సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపారు. ప్రత్యేకించి నీటిపారుదల నిర్మాణాలపై ప్రత్యేక అధ్యాయనం చేసిన ఆయన ఆ రంగంలో సమకాలిన ఇంజినీర్ల కంటే ఎంతో ఉన్నత స్థానంలో నిలిచారు. 1908లో మైసూరు మహరాజ ఆయనను తమ రాష్ట్రంలోని రాజ్యసభ చీఫ్ ఇంజినీరుగా నియమించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే కావేరి నదిపై కృష్ణరాజసాగర్‌ను నిర్మించారు. 1912లో మైసూరు దివాన్ అయ్యారు. కర్ణాటకలో ఆయనదైన నిర్మాణాలెన్నో నేటికీ అందరినీ ఆకర్శిస్తూ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

మన ప్రాంతంలో..

జిల్లాలో బ్రిటీషు కాలం నాటి ఎన్నో భవనాలు నేటికి పటిష్టంగా నిలిచి ఉండటాన్ని గమనించవచ్చు. ప్రభుత్వ పురుషుల కళాశాల, కలెక్టర్ బంగ్లా, ఎస్పీ కార్యాలయం, బంగ్లా, పాత కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం నేటికి నాటి ఇంజినీర్ల ప్రతిభను చాటుతున్నాయి. జిల్లాలో 100 సంవత్సరాలు దాటినా పటిష్టంగా ఉన్న ఎన్నో చర్చి భవనాలను కూడా గమనించవచ్చు.

ఆయనపై గౌరవంతో..

తమ శాఖలో మేరు సమానులైన మోక్షగుండెం విశ్వేశ్వరయ్యపై గౌరవంతో కడప నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎల్ఐసీ సర్కిల్‌లో ఉన్న ఈ విగ్రహం వద్ద ప్రతి ఏడాది ఇంజనీర్ల దినోత్సవ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తుంటారు. ఆయన పేరిట సమీపంలోనే ఇన్సిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో కల్యాణ ఉత్సవ మూర్తులు

రాజంపేట టౌన్ : మండలంలోని అత్తిరాల కడియాలపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో ఆదివారం రాములోరి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులను అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదపండితులు కల్యాణ క్రతువును జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ స్వామి నేతృత్వంలో నిర్వహించిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామివారి కల్యాణం జరుగుతున్నంతసేపు భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వంలో గడిపారు. పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో అత్తిరాల కడియాలపల్లె గ్రామంలో భక్తుల సందడి కనిపించింది. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం పురవీధుల్లో ఊరేగిన కల్యాణ ఉత్సవ మూర్తులను భక్తులు తిలకించి తరించారు.

ఉత్సవాల పుస్తకావిష్కరణ



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈ ఏడాది జరిగే దసరా ఉత్సవాల పుస్తకాన్ని ఆదివారం గౌరవ అధ్యక్షులు కొప్పరపు నరసింహులు, అధ్యక్షులు గునిశెట్టి రమేష్‌ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3 వరకు ఉత్సవాలు జరుపుతున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఓబులవారిపల్లె : విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం 132 కేవీ చిన్న ఓరంపాడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల ఏఈ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ విధేయుడిని కోల్పోయింది


శీను మృతదేహానికి ఆకేపాటి నివాళి

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీ పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పాటూరు శ్రీనివాసులురెడ్డి అలియాస్ జీపు శీను మరణం వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గోవాలో మృతి చెందిన ఆయన మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. శీను మృతదేహాన్ని ఆకేపాటి సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



పుల్లంపేట : మండలంలోని ప్రత్యూష హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మేరువ సురేష్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం తిరుపతి చిగురవాడ ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అపుస్మా తిరుపతి యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో సురేష్‌ను స్థానిక ఎమ్మెల్యే, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు దుశ్శాలువాలతో సన్మానించి, మెమెంటోను బహుకరించారు.

నూతన కమిటీ ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్ట్ పరిధి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుకుమారి, ప్రధాన కార్యదర్శిగా ఓబులమ్మ, వర్కింగ్ ప్రెసిడెంటుగా లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శిగా శ్రీవాణి, గౌరవ అధ్యక్షురాలుగా ప్రభావతిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

రాయచోటి టౌన్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాయచోటిలో కంటి పరీక్షలు నిర్వహించారు. 60 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 27 మందికి ఆపరేషన్లు చేశారు. అలాగే గత వారం ఆపరేషన్లు నిర్వహించిన 35 మందికి ఉచితంగా కళ్ల అద్దాలు అందించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వంతెనపై మట్టికుప్పల తొలగింపు

సిద్దవటం : హై లెవల్ వంతెనపై మట్టి కుప్పల నిల్వలు వాహనాల రాకపోకలకు ఇక్కట్లుగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆగస్టు 27న జరిగిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా హైలెవల్ వంతెన వద్ద నిమజ్జనానికి వచ్చే వినాయకుని విగ్రహాల కోసం ఏర్పాటు చేసిన మట్టి కుప్పలను ఆదివారం గ్రామ సర్పంచ్ భావనాసి నాగరాణి ఆధ్వర్యంలో రెండు ఎక్సలెటర్‌ల సహాయంతో మట్టి కుప్పలను తొలగించారు.

'హిందీని జాతీయ భాషగా ప్రకటించాలి'


రాజేంద్ర సింహకు టీచర్లు, విద్యార్థుల నివాళి

పుల్లంపేట : రాజ్యాంగంలో సవరణ చేసి హిందీని జాతీయ భాషగా ప్రకటించాలని బావికాడపల్లి హైస్కూల్ హిందీ టీచర్ సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో హిందీ దినోత్సవాన్ని సయ్యద్ సర్తాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీకి అధికారిక భాష హోదా కోసం కృషి చేసిన హిందీ సాహిత్యకారుడు రాజేంద్ర సింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ..


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో 1993 – 94 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సమ్మెట శివప్రసాద్, ఏనుగుల బాలాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను వారు ఘనంగా సత్కరించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

సుండుపల్లె : అవగాహనతో బాల్య వివాహాలను అరికట్టగలమని సమత ఎన్‌జీఓ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రం పరిధిలోని ఓ చర్చిలో సంఘ సభ్యులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలకు 18, పురుషులకు 21 ఏళ్ల పూర్తయ్యే వరకు వివాహాలు చేయరాదని ఆయన సూచించారు. చిన్న వయసులో వివాహాలు జరిగితే కలిగే దుష్ప్రభావాలను వివరించి అనంతరం బాల్య వివాహాల నిరోధించడానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు.